క్లుప్తంగా

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహాలకు పూజ నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో వెలసిన అంకాల పరమేశ్వరి ఆలయంలో సోమవారం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పురోహితులు యజ్ఞ నారాయణశర్మ నేతృత్వంలో 11 మంది పురోహితుల బృందం అశ్వర్థనారాయణ కల్యాణం, రాములవారి కల్యాణం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు. ఉదయం 7:30 నుంచి యంత్ర స్థాపన, నాగ ప్రతిష్ఠ పూర్ణాహుతి, విశేషంగా రాముల వారి కల్యాణం నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దేశీ కోళ్ల పెంపకంతో ఆదాయం


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ దాసి సుధాకరరెడ్డి

జూపాడుబంగ్లా: దేశీ కోళ్ల పెంపకంతో కుటుంబానికి అదనపు ఆదాయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి అన్నారు. సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఈకో డెవలప్‌మెంట్(ఎస్ఆర్ఈడీ) సంస్థల తరుపున దేశీయ కోళ్ల పెంపకంపై మహిళలకు 12 రోజులు శిక్షణ ఇచ్చారు.సోమవారం నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్‌పార్కులో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సొసైటీలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ప్రతి రోజు రూ.50 చొప్పున స్టైఫండ్ బ్యాంకు ఖాతాలో జమ చేసి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసి, పలు శాఖల అధికారుల పర్యవేక్షణలో ఉచిత శిక్షణ ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాయబ్, లాలుప్రసాద్, రజనీకుమార్ రెడ్డి, మెప్మా టీఎంసీ శాంతకుమారి, ఎఆర్ఈడీ ఎన్‌జీఓ పీడీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ పనులు పూర్తి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నాయిని మద్దిలేటి

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామం సమీపంలోని జగనన్న కాలనీలో సోమవారం విద్యుత్ మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఈ కాలనీలో తుమ్మలూరు, జూటూరు, రుద్రవరం గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలకు కేజీ రోడ్డు పక్కన సువిశాలమైన స్థలంలో కాలనీని ఏర్పాటు చేశారు. ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ కాలనీలో ఇదివరకే విద్యుత్ లైన్ పనులు పూర్తి చేశారు. కాగా కొంత సమస్య ఉండటంతో తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్, జూటూరు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిలేటి, దరగయ్య విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన అధికారులు వెంటనే లైన్‌మెన్ అయ్యస్వామిని ఆదేశించడంతో పనులు పూర్తి చేయడంతో సమస్య పరిష్కారమైంది. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిలేటి తదితరులు ట్రాన్స్‌ఫార్మర్‌కి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, ప్రజలు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీపై ఎంఈఓ ఆగ్రహం


వంట మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా వంట తయారు చేసిన వంట నిర్వాహకులపై ఎంఈఓ సుభాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం జగనన్న గోరు ముద్ద పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూలో విజిటబుల్ రైస్ చేయాల్సి ఉండగా ఉత్త అన్నం తయారు చేసి పెట్టడం గమనించి వంట మహిళలపై మండిపడ్డారు. మెనూ పాటించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకే ఆకస్మిక తనిఖీకి చేపట్టినట్లు ఎంఈఓ తెలిపారు. త్రీ మెన్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి వంట నిర్వాహకుల తొలగింపునకు సిఫారసు చేస్తామని చెప్పారు. ఎంఈఓ వెంట ఏపీఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జొన్న రైతుకు 'మద్దతు'

- ప్రభుత్వ మద్దతు ధర మార్కెట్ కంటే అధికం
- జిల్లాలో 12 మండలాల్లోని ఆర్బీకేల్లో కొనుగోళ్లు ప్రారంభం
- సంబరపడుతున్న అన్నదాతలు


వేల్పనూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అండగా నిలిచింది. రైతు భరోసా ద్వారా నగదు, రాయితీపై విత్తనాలు ఎరువులు అందజేస్తోంది. దీనికితోడు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల చేతిలో మోసపోతూ తల్లడిల్లిపోతున్న అన్నదాతకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తూ వారికి దన్నుగా నిలిచింది. ప్రస్తుతం చిరుధాన్యాల్లో ఒకటైన జొన్నకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది.

58 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోళ్లు

నంద్యాల జిల్లా రైతు భరోసా కేంద్రాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు మార్క్‌ఫెడ్ ద్వారా కూడ జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. శ్రీశైలం నియోజకవర్గంలో ఈ ఏడాది 1,590 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. ఇందులో వెలుగోడు మండలంలోని రేగడ గూడూరు, వేల్పనూరు గ్రామాల్లోని నాలుగు సచివాలయాల పరిధిలో, బండిఆత్మకూరు మండల పరిధిలోని బోధనం, పడమటూరు, ఎర్రగుంట్ల రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లాలోని 12 మండలాల్లో 58 రైతు భరోసా కేంద్రాలు, 13 పీఎస్ఎ ద్వారా, కేడీసీఎంఎస్ ద్వారా 10 , ఏపీ మార్కెటింగ్ ద్వారా 3 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

క్వింటా రూ.2,970 చొప్పున కొనుగోలు

జొన్న పండించిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో రైతులు సంబరపడుతున్నారు. చేతికి వచ్చిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో దళారులు కేవలం తక్కువ ధరకు అడగడంతో ఆందోళనకు గురయ్యారు. క్వింటా జొన్నలు రూ.2,500 నుంచి 2,600 చొప్పున దళారులు కొనుగోలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2,970లకు ఇస్తోంది. దీంతో అన్నదాతలు జోరుగా కొనుగోలు కేంద్రాల వద్ద జొన్నలు విక్రయిస్తున్నారు.

ఆర్బీకేలో విక్రయిస్తున్నా



చిరు ధాన్యాలకు రాష్ట్రప్రభుత్వం పెద్ద పీట వేసింది. జగనన్న ప్రభు త్వంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ముందుగానే మద్దతు ధర ప్రకటించింది. దీంతో నేను 6 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. ప్ర స్తుతం సొంత ఊరిలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధర కు విక్రయిస్తున్నా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – దేశంశివారెడ్డి, రేగడగూడూరు

దళారులు తక్కువ ధరకు కొంటున్నారు



పండించిన జొన్నల ధాన్యాన్ని ఆర్బీకేకి తరలిస్తున్నాం. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వలన రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉండి, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉంది. మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయడం, అది సొంత ఊరిలో విక్రయించడం ఆనందంగా ఉంది. – గోపాల్‌రెడ్డి, రేగడగూడూరు

రైతులు పండించిన ధాన్యం అంతా కొనుగోలు చేస్తాం



శ్రీశైలం నియోజవర్గంలో రైతులు పండించిన జొన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోళ్లు ప్రారంభించాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు జొన్న బస్తా క్వింటా ధర రూ.2,970. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

ప్రతి గ్రూపు ఏ గ్రేడు సాధించాలి

పాములపాడు: మండలంలోని ప్రతి పొదుపు గ్రూపు ఏ గ్రేడు సాధించేలా కృషి చేయాలని ఏపీఎం అనురాధ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ గ్రేడుగా ఉండాలంటే చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. మార్చి చివరి నాటికి ప్రతి గ్రూపు నుంచి వంద శాతం రికవరీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు స్త్రీ నిధి 96 శాతం, ఉన్నతి 66 శాతం, సీఐఎఫ్ 25 శాతం చొప్పున రికవరీలు చేశారని తెలిపారు. 6వ విడత జగనన్న తోడు పథకం కింద 348 మందిని ఎంపిక చేసి వారికి రుణం ఇప్పించాలని వివరించారు. సమావేశంలో స్త్రీ నిధి మేనేజర్ మధుశేఖర్, సీసీలు మనోహర్, కేశవరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతి కారకులను శిక్షించాలి

ఆత్మకూరు: గిరిజన విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు.అంబేడ్కర్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌ఎమ్ సీ కాలేజీలో వైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని ప్రీతిని వేధింపులకు గురిచేసిన నిందితులను శిక్షించాలన్నారు.

నిబంధనలు పాటించాలి

మిడుతూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ మారుతిశంకర్ అన్నారు. సోమవారం స్థానిక బస్టాండులో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధించారు.హెడ్‌కానిస్టేబుల్ చిట్టిబాబు పాల్గొన్నారు.

'వెన్నపూస'ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపంచాలని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని మారుతీనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపుకోసం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మారుతీనగర్‌లోని పట్టభద్రుల ఓటర్ల ఇంటింటి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో 12 వార్డు కౌన్సిలర్ లాలూ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అబుబాకర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ముచ్చుమర్రి చికెన్ బాషా, ఏసన్న, మార్కెట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'వెన్నపూస'కే మొదటి ప్రాధాన్యత ఓటేయ్యాలి

పగిడ్యాల: మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు కోరారు. సోమవారం పడమర ప్రాతకోట గ్రామంలో పట్టభద్ర ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఎన్నికల హామీలను 98 శాతం నెరవేర్చి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ దివాన్‌సాహెబ్, మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాష, రమణ ప్రసాద్, కురువ మల్లయ్య, కురుమన్న, మోక్షం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రచురణ

పగిడ్యాల: మండల కేంద్రమైన పగిడ్యాల గ్రామ పంచాయతీలో 9వ వార్డుకు సంబంధించి ఓటర్ల జాబితాను ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ప్రచురించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పగిడ్యాల పంచాయతీకి సంబంధించిన ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. 9వ వార్డు సభ్యుడు గుంపుల ఈశ్వరయ్య తన సభ్యత్వానికి రాజీనామా చేశారని వివరించారు. గ్రామ పంచాయతీలో 7,636 మంది ఓటర్లు, 14 వార్డులు ఉన్నాయన్నారు. 9వ వార్డు సభ్యుని ఎన్నిక నిమిత్తం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తారని వెల్లడించారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

కొత్తపల్లి: మండలంలోని కొక్కరంచ గ్రామంలో రూ.15.63 లక్షల వ్యయంతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ నీటి సౌకర్యం కోసం కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామశివారుల్లోని సుంకులమ్మ గుడి దగ్గర ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి గ్రామంలోకి పైపులైన్ వేసినట్లు చెప్పారు. ఈ పైపులైన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామని వివరించారు. పనులు పదిరోజుల్లో పూర్తిచేస్తామన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు


స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరుడికి సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులు చేపట్టి గోమాతకు విశేష అలంకారం, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం కనుల పండువగా జరిగింది.

పంచాయతీ కార్యదర్శికి చార్జ్‌మెమో

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండలం కోళ్లబవాపురం గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు ఈఓఆర్డీ శర్మ చార్జ్ మెమో జారీ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని 2–31 నంబరు గల ఇంటికి సంబంధించిన పత్రాలను వెంకటేశ్వర్లు తారుమారు చేసి, మరోకరికి రిజిష్టర్ అయ్యే విధంగా చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడరని తెలిపారు. దీంతో బాధితులు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శికి చార్జ్ మెమో జారీ చేశామని వెల్లడించారు.

సిద్ధాపురంలో కణితి మాంసం లభ్యం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని సిద్దాపురం గ్రామంలో కణితి మాంసం లభ్యమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం గ్రామంలో తణిఖీలు నిర్వహించిన అటవీ శాఖ అధికారులు కణితి మాంసాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నందు వల్ల అధికారులు పూర్తి సమాచారాన్ని ప్రకటించడానికి నిరాకరించారు. త్వరలో పూర్తి సమాచారంతో నిందితుల వివరాలు తెలియజేస్తామని టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ అలెన్ చోంగ్ టెరాన్ తెలిపారు.

త్యాగధనులు రేనాటి సూర్యచంద్రులు


రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, రేనాటి సూర్యచంద్రులుగా పేరు గాంచారని అంతర్జాతీయ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో రేనాటి సూర్య చంద్రుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలుకు చెందిన లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కలియుగ దానకర్ణుడిగా పేరు గాంచిన బుడ్డా వెంగళరెడ్డికి దాతృత్వంలో ఎవరు సాటి లేరన్నారు. దాన, శౌర్య వీరులను స్మరించుకోవడం కనీస బాధ్యత అన్నారు. అనంతరం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్న కోవెలకుంట్ల కవిత్రి విజయదుర్గను సత్కరించారు. అలాగే భారత తపాలా శాఖ రూపొందించిన బుడ్డా వెంగళరెడ్డి ప్రత్యేక తపాలా కవర్లు విడుదల చేశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, కర్ణానాటి రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులపతి, రఫీ, అన్నెం శ్రీనివాసరెడ్డి, కొప్పుల ప్రసాద్, శేషఫణి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం సాధ్యం

- గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ అభ్యర్థుల విజయాలకు కృషి చేయండి
- నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

కొత్తపల్లి: సమష్టి కృషితోనే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన అభ్యర్థుల విజయం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 13వ తేదీ జరబోవు ఎమ్మెల్సీ ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల అందరూ కలసికట్టుగా పనిచేసి పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ, పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఓటర్ల లిస్టులో ఉన్న ప్రతి ఒక్కరిని కలిసి వైఎస్సార్‌సీపీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి వెన్నపూస రవీంద్రనాథ్ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్‌గా జీఎండీ రఫీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, కలబండి మారెన్న, నక్క.విజయకుమార్, ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథరెడ్డి, సాయిరాం, రమేష్, ప్రసాద్, సుబ్బన్న, చిన్న ఓబులేసు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం

ఆత్మకూరు: పట్టణంలోని గరీబ్‌నగర్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరుతూ డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్ర, రణధీర్, రామ్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 13న జరిగే శాసన మండలి పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానందిలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర, కోదండరామాలయం, వినాయకనంది, అన్నదానం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకలను లెక్కించనున్నట్లు వెల్లడించారు. స్థానిక అభిషేకమండపంలో జరిగే హుండీ కానుకల లెక్కింపునకు సిబ్బంది అందరూ హాజరు కావాలని కోరారు.

కేసు నమోదు

మిడుతూరు: ఓ వ్యక్తి తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతిశంకర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన మొల్ల బషీరూన్ బీ, ఆదామ్ సాహెబ్ దంపతులకు శనగమిషన్ ఉంది. శనగమిషన్ పట్టేందుకు కూలీ పనుల కోసం అదే గ్రామానికి చెందిన చంద్రుడు, మేరమ్మ, రాజు, సోగరాజు ప్రవీణ్ కుమార్‌లు ఈ నెల ఆరో తేదీన వెళ్లారు. పని చేసే సమయంలో అజాగ్రత్త వల్ల సోగరాజు ప్రవీణ్ కుమార్ కిందపడ్డాడు. అతనికి ఎలాంటి గాయాలు కాకపోయినా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మిషన్ యజమానులు డబ్బు ఇచ్చారు. అయితే 26వ తేదీ ఆదివారం ఉదయం బషీరూన్ బీ, కోడలు రేష్మా ఇంట్లో ఉండగా సోగరాజు ప్రవీణ్ కుమార్ తండ్రి సోగరాజు పుల్లయ్య అక్రమంగా లోనికి ప్రవేశించాడు. హాస్పిటల్ ఖర్చులకు ఇచ్చిన డబ్బులు సరిపోలేదని, మరింత డబ్బు ఇవ్వమని అడగాడు. అయితే ఇంట్లో ఎవరూ లేరని, తన భర్త వచ్చిన తర్వాత రమ్మని బషీరున్ చెప్పింది. అయినా వినిపించుకోకుండా పుల్లయ్య బషీరూన్ బీ, కోడలు రేష్మాను అసభ్యపదజాలంతో దూషిస్తూ మీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరిస్తూ.. డబ్బులు ఇవ్వకపోతే నీ భర్తను చంపుతానని బెదిరింపులకు గురిచేశాడు. ఇంటిపక్కల వారు హుసేన్‌బీరా, విజయ్, కిరణ్‌లతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి మహిళలను అతని బారీ నుంచి కాపాడారు. అనంతరం బాధితురాలు బషిరూన్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విజ్ఞానాన్ని అభివృద్ధికి వినియోగించాలి

నంద్యాల(అర్బన్): కష్టపడి సంపాదించుకున్న విజ్ఞానాన్ని అభివృద్ధికి వినియోగించుకోవాలని, తోటి విద్యార్థులను వేధించడం సరికాదని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమీమ్ బేగం, జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ తెలిపారు. స్థానిక అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆత్మహత్యకు పాల్పడిన వైద్య విద్యార్థిని ప్రీతి, పాణ్యం మండలం అలమూరుకు చెందిన ప్రసన్న మృతికి నివాళులర్పించారు.

చీటింగ్ కేసు నమోదు

దొర్నిపాడు: ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేసిన ముగ్గిరిపై స్థానిక పోలీసులు సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిచ సుమంత్ నుంచి సురేంద్రారెడ్డి, సాయికృష్ణ, రాజా రూ.15 లక్షల వరకు వసూలు చేశారు. అయితే ఉద్యోగం ఇప్పించక పోగా.. పాటు డబ్బులు అడిగితే ముఖం చాటేస్తుండటంతో సుమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



తాను కుట్టిన డిజైన్ జాకెట్‌ను చూపుతున్న ఈమె పేరు స్వర్ణలత. ఈమె డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో చిన్న చిన్న పనుల తో పాటు టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పదేళ్ల నుంచి డిజైన్ జాకెట్లు, డ్రెస్‌లు కుట్టుకుంటూ నెలకు రూ.10వేల వరకు సంపాదిస్తుంది. డిజైన్‌ను బట్టి ధర నిర్ణయిస్తామంటోంది.



ఈ టైలర్ పేరు వీర మల్లేశ్వరుడు. ఈయన దొర్నిపాడులో 20 ఏళ్ల నుంచి దర్జీ వృత్తితోనే ఉపాధి పొందుతున్నాడు. విద్యార్థుల స్కూల్ డ్రెస్, షర్టులు, ప్యాంట్లు కుట్టిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నాడు.

దర్జాగా రాణింపు

- రెడీమేడ్ యుగంలోనూ ఉనికి చాటుతున్న దర్జీలు
- ఎంతో మందికి జీవనాధారంగా టైలరింగ్
- పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు
- నేడు టైలర్స్ డే


రామచంద్రాపురంలో ఉమ్మడిగా టైలరింగ్ చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: రెడీమేడ్ ట్రెండ్‌ను తట్టుకుంటూ నైపుణ్యాలను పెంపొదించుకుంటూ.. పోటీ ప్రపంచంలో మందుకు సాగుతున్నారు. ఏళ్ల తరబడి అదే వృత్తిలో స్థిరపడి తమ కుటంబాలను పోషించుకుంటూ తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నారు టైలర్లు. ఎంతో మంది నిరుద్యోగులకు, గృహిణులు..తాము స్వయం శక్తితో జీవించగలం అనే గట్టి నమ్మకం ఇచ్చే అద్భుతమైన వృత్తి.. నేడు అంతర్జాతీయ టైలర్ల దినోత్సం సందర్భంగా కథనం.

టైలర్స్ డే ఇలా..

దుస్తులు కుట్టుకునేందుకు తన భార్య పడుతున్న అవస్థలను జర్మన్‌కి చెందిన విలియం హావే గమనించాడు. 1846లో 11 నెలల పాటు శ్రమించి కట్టుమిషన్‌ను కనిపెట్టారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా కుట్టుమిషన్లు వినియోగంలోకి వచ్చాయి. ఫిబ్రవరి 28న కుట్టుమిషన్ రూపకర్త జన్మించడంతో టైలర్స్ డేగా జరుపుకుంటున్నారు.

పురుషులతో సమానంగా..

ఎక్కువ ఉపాధి అవకాశాలున్న రంగం టైలరింగ్. గ్రామాలు, మధ్య తరగతి పట్టణాల్లో అధికశాతం మంది టైలరింగ్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా శిక్షణ తీసుకుని సొంతింట్లోనే ఉంటూ ఉపాధి పొందుతున్నారు. గతంలో పురుషులే ఈ రంగాన్ని ఏలేవారు. ప్రస్తుతం వారితో సమానంగా మహిళలు దూసుకుపోతున్నారు.

కుటుంబ వృద్ధికి చేయూత..

గ్రామాల్లో మహిళలు, యువతులు టైలర్ వృత్తిని నమ్ముకుంటున్నారు. రోజు రోజుకు మారుతున్న డిజైన్లకు అనుగుణంగా వినియోగదారులను మెప్పించేలా జాకెట్లు కుట్టే వారికి అధికంగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఒక జాకెట్ కుట్టడానికి డిజైన్‌ను బట్టి పట్టణాల్లో రూ.400 నుంచి రూ.6వేల వరకు తీసుకుంటున్నారు. సాధారణ జాకెట్టుకు రూ.300లకు పైగా చెల్లించాల్సి వస్తుంది. తమ ఆదాయంతో కుటుంబ వృద్ధికి అండగా నిలుస్తున్నారు.

రెడీమెడ్ ప్రభావాన్ని తట్టుకుంటూ....

ప్రస్తుతం రెడీమెడ్ దుస్తుల ప్రభావం టైలర్స్‌పై అధికంగా చూపుతుంది. ప్రస్తుతం ఒక చొక్కా కుట్టేందుకు టైలర్ రూ.300 వరకు తీసుకుంటున్నాడు. అదే రెడీమెడ్‌లో రూ.200 కూడా షర్టు దొరుకుంది. అలాగే ప్యాంట్ కుట్టడానికిరూ.700వరకు తీసుకుంటున్నారు.